RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్ DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 29 శనివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 204 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | SATURDAY AUGUST 29 2026 | VOL:16 | ISSUE: 204 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

**ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా అభివృద్ధి..ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి**

**గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలుప్రభుత్వ సేవలను ఉపయోగించడం**



చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు కల్పించాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మీర్ ఆలం చెరువును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సందర్శన సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య



**రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ**

**రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ**

**రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య**

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం.. మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

**అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్**

**తన కుర్చీ నుంచి లేచి మంత్రుల మధ్య కూర్చుని ఆశ్చర్యపరిచిన వైనం**

**ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు**

**సభలో అధికారులు ఉండాలని డిమాండ్ చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి**

(మిగతా 2వ పేజీలో..)



## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి హామీ

**అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు**

**జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక**

**మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ**

**10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి**

**విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం**



తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో

(మిగతా 2వ పేజీలో..)

## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది: కవిత

**సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత**

**అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు**

**ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక**

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల

(మిగతా 2వ పేజీలో..)



# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం చంద్రబాబు

**ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

**ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం**

**అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన**

**రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి**

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన

(మిగతా 4వ పేజీలో..)




## నేపాల్‌కి మరో భారీ జల ప్రళయం..హెచ్చరికలు జారీ



**హైదరాబాద్ :** నేపాల్‌ను మరోసారి భారీ జల ప్రళయం ముంచెత్తనుందని ఆ దేశ ఆర్మీ హెచ్చరికలు జారీ చేసింది. 5 రెట్ల తీవ్రతతో వరదలు వస్తున్నాయని, మరో 20 నిమిషాల్లో వరద వస్తుందని నేపాల్ అధికారులు హెచ్చరించారు. ఈ హెచ్చరికలతో నేపాల్ వాసులు తీవ్ర భయాందోళనలకు గురై పరుగులు తీస్తున్నారు. అధికారులు పరిస్థితిని అంచనా వేస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

RNI NO. TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

# డిజిటల్ వేగం.. వార్తకు పరీక్ష!

సమాచార విప్లవం వార్తా ప్రపంచాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు ఉదయం పత్రికలో వచ్చే వార్త కోసం పాఠకులు ఎదురుచూసేవారు. ఇప్పుడు సంఘటన జరిగిన క్షణాల్లోనే సమాచారం మొబైల్ ఫోన్‌కు చేరుతోంది. సోషల్ మీడియా, డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫారాలు, యూట్యూబ్, మెసేజింగ్ యాప్‌లు వార్తల వ్యాప్తిని ఎన్నో రెట్లు పెంచాయి. అయితే వేగం పెరిగినంత మాత్రాన వార్త నాణ్యత పెరిగినట్లు కాదు. వాస్తవ నిర్ధారణ లేకుండా సమాచారాన్ని పంచడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది.వార్తా సంస్థల మధ్య పోటీ కూడా ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. ముందుగా వార్త ఇవ్వాలనే ఆత్రుతలో కొన్ని సందర్భాల్లో పూర్తిస్థాయి సమాచారం లేకుండానే కథనాలు వెలువడుతున్నాయి. ఒక చిన్న పొరపాటు కూడా డిజిటల్ వేదికలపై క్షణాల్లో వేల మందికి చేరుతుంది. ఆ తర్వాత సవరణ ఇచ్చినా, మొదట వ్యాపించిన తప్పుడు సమాచారం మాత్రం ప్రజల జ్ఞాపకాల్లో మిగిలిపోతుంది. అందుకే జర్నలిజంలో వేగం కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి సమాచారం వార్త కాదు. పాత వీడియోలను కొత్త ఘటనలకు అన్వయించడం, ఫొటోలను వేరే సందర్భంలో ఉపయోగించడం, నిర్ధారణ కాని గణాంకాలను ప్రచారం చేయడం వంటి పరిణామాలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమాచారాన్ని యథాతథంగా ప్రచురించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా, సంబంధిత వ్యక్తులు, సంస్థల ప్రతిష్ఠకు కూడా నష్టం కలిగించవచ్చు.ఈ నేపథ్యంలో జర్నలిస్టు పాత్ర మరింత కీలకంగా మారింది. వార్తను ముందుగా తెలుసుకోవడం మాత్రమే కాదు.. దాని నిజానిజాలను నిర్ధారించడం, సంబంధిత వ్యక్తుల వాదనలను తెలుసుకోవడం, ఆధారాలను పరిశీలించడం, అవసరమైన సందర్భాన్ని పాఠకుడికి అందించడం జర్నలిస్టు బాధ్యత. ముఖ్యంగా రాజకీయాలు, నేరాలు, ఆరోగ్యం, ఆర్థిక వ్యవహారాలు వంటి సున్నితమైన అంశాల్లో మరింత జాగ్రత్త అవసరం.అదే సమయంలో పాఠకుడి బాధ్యత కూడా ఉంది. నచ్చిన వార్తను వెంటనే నమ్మడం, పరిశీలించకుండా ఫార్వర్డ్ చేయడం మానుకోవాలి. వార్తకు మూలం ఏమిటి? అది ఎప్పుడు ప్రచురితమైంది? సంబంధిత అధికారిక సంస్థ ఏమంటోంది? ఇతర విశ్వసనీయ వార్తా సంస్థలు అదే విషయాన్ని ధృవీకరించాయా? వంటి ప్రశ్నలు వేసుకోవాలి. సాంకేతికతను ఆపడం సాధ్యం కాదు.. అవసరం కూడా లేదు. కానీ సాంకేతికతతో వచ్చిన వేగానికి జర్నలిజం విలువలు బలికాకూడదు. ప్రజలకు ముందుగా చేరే వార్త కంటే, ప్రజలు నమ్మదగిన వార్తే సమాజానికి ఎక్కువ ఉపయోగకరం. డిజిటల్ యుగంలో వార్తా సంస్థల అసలు పోటీ కూడా ఇదే కావాలి---లిలిఎవరు ముందుగా చెప్పారు అనేది కాదు.. ఎవరు నిజాన్ని బాధ్యతగా చెప్పారు అనేదే ముఖ్యం.

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

మొదటి పేజీ తరువాయి)

దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోదం, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారని తెలిపారు.?

### ఐలాండ్లకూ కొత్త రూపు

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులు పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.?

### జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

### సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తి కాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి హామీ

మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది: కవిత

మొదటి పేజీ తరువాయి)

సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు.వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

# తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం.. మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

### ఉదయనిధి వాదనతో ఏకీభవించి హామీ ఇచ్చిన స్పీకర్ ప్రభాకర్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది.సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం.అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.

### అధికారుల హాజరుపై ప్రతిపక్ష నేత డిమాండ్

ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు" అని ఆయన ప్రస్తావించారు.దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.



# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ౹ా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



RNI NO. : TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# జర్నలిస్టు సోదరులకు రాఖీ కట్టి.. హెల్మెట్లు అందజేత

**రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేక చొరవ**

**జర్నలిస్టుల భద్రతతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన**

**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 28:**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిత్యం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే జర్నలిస్టుల సంక్షేమం, భద్రతపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లోని తన స్వగృహంలో జర్నలిస్టు సోదరులకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలువురు జర్నలిస్టులకు హెల్మెట్లను చిరుకానుకగా అందజేశారు. అనంతరం జర్నలిస్టు మిత్రులకు అల్పాహార విందు ఏర్పాటు చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటిస్తూ రాఖీ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు, అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు జర్నలిస్టులు వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో చోటుచేసుకునే సమస్యలు, ప్రజల ఇబ్బందులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. వార్తల సేకరణలో భాగంగా జర్నలిస్టులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటారని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని తన వంతు బాధ్యతగా కొందరు జర్నలిస్టు మిత్రులకు హెల్మెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. రాఖీ పండుగ సందర్భంగా జర్నలిస్టులకు రాఖీలు కట్టి, వారి క్షేమాన్ని కోరుకోవడంతో పాటు హెల్మెట్లు అందించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు.





### హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఐపీఎస్ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని సత్యవతి రాథోడ్ తెలిపారు. పోలీసులు, అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించగలమని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, అతివేగంగా ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. హెల్మెట్ కేవలం పోలీసుల భయంతో ధరించేది కాదని, మన ప్రాణాలను మనమే కాపాడుకునేందుకు ధరించాల్సిన రక్షణ కవచమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తలకు తీవ్రమైన గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణ కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.

### కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి

రోడ్డు ప్రమాదం ఒక్క వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని సత్యవతి రాథోడ్ అన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలతో పాటు తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సర్పంచ్ ఉప్పల సోమన్న ఘటనను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. ఆయన హెల్మెట్ ధరించి ఉండి ఉంటే తలకు తీవ్ర గాయం కాకుండా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడం ఎంతటి విషాదాన్ని మిగులుస్తుందో తనకు తెలుసని అన్నారు.

### మా కుటుంబంలోనూ రోడ్డు ప్రమాద విషాదం

రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే బాధ తనకు వ్యక్తిగతంగా కూడా తెలుసని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. తమ కుటుంబంలోనూ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని, తన భర్త కూడా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విషాదాన్ని గుర్తుచేసుకుంటూ.. ఇలాంటి పరిస్థితి మరే కుటుంబానికీ రాకూడదనే ఉద్దేశంతోనే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం జీవితాంతం కుటుంబాన్ని బాధించే పరిస్థితికి దారితీయవచ్చని అన్నారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనాలను జాగ్రత్తగా నడపడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత వాహనాలు నడిపే సమయంలో వేగ నియంత్రణ పాటించాలని, పోటీగా వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

### చిరుకానుకగా హెల్మెట్ అందిస్తున్నా'

"అందరికీ కాకపోయినా కొందరు జర్నలిస్టు మిత్రులకైనా నా వంతుగా ఈ చిన్న కానుక అందిస్తున్నాను. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ, వార్తల సేకరణలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విధులు నిర్వహించే జర్నలిస్టు సోదరులందరి క్షేమాన్ని కోరుకుంటున్నాను. రాఖీ పౌర్ణమి సందర్భంగా మీకు రాఖీ కట్టి, మీ భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్‌ను చిరుకానుకగా అందిస్తున్నాను" అని సత్యవతి రాథోడ్ తెలిపారు. జర్నలిస్టులు ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. వార్తల సేకరణలో భాగంగా అనేక సందర్భాల్లో రాత్రి వేళల్లోనూ ప్రయాణించాల్సి వస్తుందని, అలాంటి సమయంలో జర్నలిస్టులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కదాని బాధ్యత కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని సత్యవతి రాథోడ్ అన్నారు. పోలీసులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నారని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా భద్రతా నియమాలను పాటించాలని కోరారు. హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు భరోసాగా నిలవాలని సూచించారు. రాఖీ పండుగ సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక అని, ఈ సందర్భంగా జర్నలిస్టు సోదరులకు రాఖీలు కట్టి వారి క్షేమాన్ని ఆకాంక్షించడం ఆనందంగా ఉందని సత్యవతి రాథోడ్ అన్నారు. జర్నలిస్టుల భద్రత, ప్రజల ప్రాణ రక్షణకు హెల్మెట్ వినియోగం ఎంతో కీలకమని పేర్కొంటూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించాలని పిలుపునిచ్చారు.

# స్మార్ట్ కిడ్జ్‌లో ఆనందోత్సవంగా రక్షాబంధన్





















### వెల్లివిరిసిన ఆత్మీయ సోదర, సోదరీమణుల ప్రేమ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 28 (దేశ టైమ్స్):**

సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం ఖమ్మంలోని స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి తరగతిలో విద్యార్థినులు తమ సహ విద్యార్థులైన బాలుర ముంజేతులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి ఆత్మీయతను చాటుకున్నారు. దీంతో పాఠశాలలో సోదర ప్రేమ వెల్లివిరిసింది. రాఖీలు కట్టే సమయంలో బాలుర ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా పాఠశాల పరిసరాల్లోని చెట్లకు కూడా విద్యార్థులు రాఖీలు కట్టి లి"వృక్ష బంధం"లిను చాటుకున్నారు. అంతేకాకుండా పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్, డ్రైవర్లు, తమ కార్యక్రమాలను ఎల్లప్పుడూ చిత్రీకరిస్తున్న ఫోటోగ్రాఫర్లకు విద్యార్థులు రాఖీలు కట్టడం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, విద్యార్థుల్లో సహోదర ప్రేమ, ఆత్మీయత, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించేందుకు రక్షాబంధన్ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. "అన్నాచెల్లెళ్ల అనుబంధం జీవితాంతం నిలిచే ఒక మధురమైన బంధం. చేతికి కట్టే రాఖీ ఒక దారం మాత్రమే కాదు.. ప్రేమకు, నమ్మకానికి, ఆప్యాయతకు ప్రతీక" అని పేర్కొన్నారు. పురాణాల కాలం నుంచి మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో రక్షాబంధన్ వేడుకలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. తోడబుట్టిన సోదరులకే కాకుండా, ఇతరులను కూడా సోదరులుగా భావించి రాఖీలు కట్టే సంప్రదాయం మన దేశ ప్రత్యేకత అని తెలిపారు. రాఖీ పర్వదినం ప్రజలందరిలో అనురాగం, ఆప్యాయత, ఐకమత్య భావాలను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## చలో సెక్రటేరియట్ ముట్టడికి మాలలు తరలిరావాలి

**కూచిమల్ల నాగేష్,మాల మహానాడు మండల అధ్యక్షులు**

**వలిగొండ ఆగస్టు 28(దేశ టైమ్స్)**




వలిగొండ మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మాలలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయడానికి చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మాట్లాడుతూ మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు పిలుపుమేరకు ఆగస్టు 31న నిర్వహించే చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి మాల విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు రాపోలు పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పుర్మ అంజయ్య, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, దాసరి లింగస్వామి, రాపోలు కృష్ణ, రాపోలు మూర్తి, రామలింగం, రాపోలు రమేష్, కేతం ఇంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 28**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు సైడ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వ పాఠశాలలో బిల్డింగ్స్ పహారిగోడలు మంచినీరు టాయిలెట్స్ కంప్యూటర్ ల్యాబ్స్ కాలి పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మరిపెడ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపటనున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న సిఐటియు మండల నాయకులు గుండ గాని మధుసూదన్ రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు తాటికొండ అనంత చారి తెలియజేశారు ఆగస్టు 28న మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో ప్రజా సమస్యలపై జరిగే ధర్నాకు కదిలి రావాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారని ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాల ను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ ఎస్టీలకు అంబేద్కర్ అభయ హస్తం 12 లక్షలు ఇవ్వాలని పెన్షన్ పెంపు చేయాలని వంటగ్యాస్ 500 రూపాయలకు ఇవ్వాలని కల్పించాలని డిమాండ్ చేశారు ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు. ఈ కార్యక్రమంలో చిల్లంచర్ల గ్రామ కార్యదర్శి చెన్నబోయిన వెంకన్న, చిన్నబోయిన ఉపేందర్, ఆదిముల్ల ఉపేందర్, సూదుల సోమయ్య, మామునూరి రేణుక, సొంచు భాస్కర్, తూము మధు, తూము మీనా, చాలంకి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన అమరులకు ఘన నివాళులు

**వలిగొండ, ఆగస్టు: 28 (దేశ టైమ్స్)**




ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడిన వారిపై పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన అమరుల చిత్రపటానికి సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులపై పెంపు భారంగా మారుతుందని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు బషిరాబాగ్ లో చేపట్టిన ధర్నాలో పోలీసులు జరిపిన కాల్పుల్లో బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ లు మృతి చెందారని వారి ఆత్మ శాంతి కోసం నివాళులర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో శీలం స్వామి, సాయిని యాదగిరి, సల్వాద్రి రవీందర్, బొడిగె సుదర్శన్, చొప్పరి వెంకటేశం, కనకబోయిన ఆంజనేయులు, ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల నరసయ్య, ఆదిమూలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయ స్వామి శోభాయాత్ర




**రుద్రంగి ఆగస్టు 28(దేశ టైమ్స్)**



నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో మార్కండేయ స్వామి శోభాయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై మగ్గాన్ని ఏర్పాటు చేసి వస్త్రాన్ని నేయడం ఆకట్టుకుంది. మరో ట్రాక్టర్‌పై శంకరుడు, మార్కండేయుడు, యముడు, చిత్రగుప్తుడు, బటులు తదితరుల వేషధారణలతో అలంకరించి పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా భక్తులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మగ్గంపై నేసిన వస్త్రాన్ని వేలం వేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంచే రమేష్, పులి లక్ష్మీరాజం, ఓం ప్రకాష్, గణేష్, రాజేశం, ప్రవీణ్, నరేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నూలు పౌర్ణమి సందర్భంగా సంప్రదాయాలను కొనసాగిస్తూ మార్కండేయ స్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## ఫేమస్ బేకరీ షాప్ ను ప్రారంభించిన సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి.



**(యాదాద్రి కరస్పాండెంట్) దేశ టైమ్స్, ఆగస్టు 28.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో ఫేమస్ బేకరీ షాప్ ను స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమాని ఇబ్రహీం మాట్లాడుతూ బేకరీ, స్వీట్స్ జ్యూస్ లను నాణ్యతతో తయారు చేస్తామని వినియోగదారులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులుగా గంధ మల్ల నరసింహ గౌడ్.

**(యాదాద్రి కరస్పాండెంట్ )దేశ టైమ్స్,ఆగస్టు 28.**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని లింగరాజు పల్లి గ్రామానికి చెందిన గంధ మల్ల నరసింహ గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ వలిగొండ మండల ఉపాధ్యక్షులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకం తో మండల ఉపాధ్యక్షుడు గా నియమించిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాములు కృతజ్ఞతలు తెలిపారు.తమ నియామకానికి సహకరించిన మండల నాయకులకు,గ్రామ నాయకులకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పలువురు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

## ‘మహేంద్రగిరి వారాహి’ ట్రైలర్.. శాపం వెనుక రహస్యం ఏమిటి?

- విడుదలైన సుమంత్ ‘మహేంద్రగిరి వారాహి’ అఫీషియల్ ట్రైలర్
- మహేంద్రగిరి రాజవంశంపై ఉన్న శాపం చుట్టూ తిరిగే కథ
- పురావస్తు శాస్త్రవేత్త పాత్రలో ఉత్కంఠ రేపుతున్న సుమంత్
- భారీ తారాగణంతో సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌గా వస్తున్న చిత్రం
- ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న సినిమా విడుదల

విభిన్నమైన కథలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న హీరో సుమంత్, తాజాగా నటిస్తున్న ఆసక్తికర చిత్రం ‘మహేంద్రగిరి వారాహి’. సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. హైదరాబాదులో నేడు జరిగిన ఈవెంట్ లో ట్రైలర్ ను ఆవిష్కరించారు. పురాణం, ఆధునిక మిస్టరీ అంశాలను జోడించి రూపొందించిన ఈ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది.సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. మహేంద్రగిరి రాజవంశానికి వారాహి అమ్మవారి శాపం ఉంటుంది. ఆ శాపం కారణంగా ఆ వంశంలో పుట్టిన ఏ మగ సంతానం కూడా 33 ఏళ్ల వయసు దాటి బ్రతకదు. ఈ వింత శాపం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు రంగంలోకి దిగిన ఒక పురావస్తు శాస్త్రవేత్త లేదా చరిత్రకారుడి పాత్రలో సుమంత్ కనిపించనున్నారు. ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో, థ్రిల్లింగ్ అంశాలతో నిండి ఉంది. శాపం వెనుక ఉన్న దైవిక రహస్యాన్ని సుమంత్ పాత్ర ఎలా ఎదుర్కొంటుంది అనేదే ఈ చిత్ర కథ.ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేశ్, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల, అలీ, మంజు భార్గవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువ నటుడు సిద్ధు జొన్నలగడ్డ ఈ చిత్రంలో గెస్ట్ రోల్ లో కనిపించనుండటం విశేషం. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా, రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిల్మ్స్ పతాకాలపై మధు కలిపు, లక్ష్మణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే జూన్‌లో విడుదలైన టీజర్ మంచి బజ్‌ను క్రియేట్ చేయగా, తాజాగా వచ్చిన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. అన్నపూర్ణ స్టూడియోస్‌లో పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుపుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# వలిగొండలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





### అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ

**వలిగొండ, ఆగస్టు 28 : (దేశ టైమ్స్)**

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం రక్షాబంధన్ పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరుల చేతులకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, క్షేమాభివృద్ధిని ఆకాంక్షించారు. సోదరులు సైతం తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందించి ఆప్యాయతను చాటుకున్నారు.రాఖీ పండుగ సందర్భంగా గ్రామాల్లోని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి రాఖీ వేడుకల్లో పాల్గొనడంతో సందడి కనిపించింది. మండలంలోని ప్రధాన కూడళ్లలో వివిధ రకాల రంగురంగుల రాఖీల విక్రయాల కోసం ప్రత్యేక స్టాళు ఏర్పాటు చేశారు. రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన కూడళ్లలో సందడి నెలకొంది. అదేవిధంగా స్వీట్ల దుకాణాలు సైతం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రక్షాబంధన్ పండుగ సందర్భంగా అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయత, అనురాగం వెల్లివిరిసింది.



## ‘టాక్సిక్’ ఫలితంపై నయనతార స్పందన

- సినిమా అనేది ఎంతో భావోద్వేగమైనదన్న నయనతార
- కొండంత ఆశలు పెట్టుకున్న చిత్రాలు కూడా డిజాస్టర్ అవుతాయని వ్యాఖ్య
- ఫలితం ఎలా వచ్చినా ఒకే విధంగా స్వీకరించడాన్ని తాను నేర్చుకున్నానన్న నయన్

కన్నడ రాకింగ్ స్టార్ యశ్, నయనతార తదితరులు నటించిన చిత్రం ‘టాక్సిక్’. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంటోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో రకరకాల విమర్శలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నయనతార స్పందించారు.సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ... “పరిశ్రమలో ఉన్న అనుభవం ఒక సినిమాను ఎలా తీస్తారనే దానిపై ప్రాథమిక అవగాహన ఇస్తుంది కానీ, సినిమా అనేది ఎంతో భావోద్వేగభరితమైనది, ఊహించని మలుపులతో కూడుకున్నది. నా కెరీర్‌లో కచ్చితంగా పెద్ద హిట్ అవుతాయని కొండంత ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అదే సమయంలో, కొన్ని చిత్రాల ఫలితంపై నాకే సందేహాలు ఉండేవి కానీ, అవి బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో భారీ విజయాలు సాధించి ఆశ్చర్యపరిచాయి” అని తెలిపారు. ఈ ఒడిదొడుకుల నుంచి తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠం గురించి చెబుతూ... “చిత్ర పరిశ్రమలో నా ఇన్నేళ్ల ప్రయాణం ఒక విషయాన్ని నేర్పింది. సినిమా విజయమైనా, అపజయమైనా రెండింటినీ ఒకే విధంగా, వినయంతో స్వీకరించడం నేను నేర్చుకున్నాను” అని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280